వార్త

సోమవారం 3, మార్చి 2008

ఇతరులు మంచిదని భావించినదానిని గాక, మనకు నచ్చిన దానిని పొందడమే నిజమైన ఆనందం - రోష్‌ఫోకాల్డ్

కాశ్మీర్‌పై పరిణత వాణి

పాకిస్థాన్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనున్న పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పిపిపి)కి అధ్యక్ష స్థానంలో ఉన్న ఆసిఫ్ అలీ జర్దారీ కాశ్మీర్ అంశంపై చేసిన వ్యాఖ్యలు ఒక ఆశావహమైన ఆలోచనా పరిణతిని సంకేతిస్తున్నాయి. మనదేశానికి చెందిన ఒక ప్రైవేట్ టివి ఛానల్‌కు ఆయన ఇంటర్వ్యూ ఇస్తూ, కాశ్మీర్ సమస్యను పక్కనపెట్టి, భారత్-పాకిస్థాన్ సంబంధాలను మెరుగుపరిచే దిశలో ఇతర అంశాలపై దృష్టి లగ్నం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. నిజానికి, ఇలా ప్రధాన వివాదాంశాన్ని పక్కన ఉంచి ఇతర విషయాలలో ద్వైపాక్షిక సంబంధాలను అభివృద్ధి చేసుకోవాలన్న ప్రాప్తకాలిక దృష్టి కొత్తదికాదు. భారత-చైనాలు ఇప్పటికే ఈ పని చేస్తున్నాయి. రెండు దేశాల మధ్య దశాబ్దాలుగా ఉద్రిక్తతను పెంచుతూ చర్చలకు, రాకపోకలకు ప్రతిబంధకంగా మారిన సరిహద్దు వివాదాన్ని పక్కన ఉంచి ఆర్థిక, వాణిజ్య తదితర రంగాలలో సహకరించుకోవడం ద్వారానే రెండు దేశాలు ఎంతోకొంత దగ్గరయ్యాయి. ఈ సుహృద్భావస్థితి సరిహద్దు వివాదం వంటి జటిల సమస్య పరిష్కారానికి ఊతమిస్తున్నది. భారత్-పాకిస్థాన్ సంబంధాల అభివృద్ధికి కూడా ఇటువంటి బ్లూప్రింట్‌నే అనుసరించే ప్రయత్నమూ గత నాలుగైదేళ్ళుగా జరుగుతూనే ఉంది. అయితే పాకిస్థాన్ ఉండి ఉండి కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తుతూ, చర్చలను కాశ్మీర్ కేంద్రితం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో జర్దారీ వ్యాఖ్యలు మరింత స్పష్టత కలిగిన ఆలోచనా వైఖరిని పట్టి చూపుతున్నాయి.

ఈ వ్యాఖ్యలలో వ్యక్తమైన పరిణతి, లోచూపు విశేషించి ఆశ్చర్యం గొలుపుతున్నాయి. భారత-పాకిస్థాన్ సంబంధాలు కాశ్మీర్ అంశానికి 'బందీ' కారాదని అనడమేకాదు, దానిని పరిష్కరించే బాధ్యతను, మనకంటె పరిణతి విజ్ఞతా వివేకాలు కలిగిన రేపటి తరాలకు విడిచిపెడదామని ఆయన సూచించారు. రాబోయే తరాలవారు మానసికంగా మనల్ని మించి ఎదిగి మానవీయబంధాన్ని, సంబంధా లనూ పరస్పరం అల్లుకొని, ప్రేమభావన నుంచి వైరభావాలకు తలకొరివి పెట్టవచ్చునని, అంతవరకు రెండు దేశాలు ఓపిక పట్టవచ్చునని ఆయన స్పష్టం చేశారు. సరిహద్దులు లేని ప్రపంచం ఆవిష్కృత మవుతున్నదన్నారు. జర్దారీ మాటల్లో రాజకీయ వాదులు చెప్పే రివాజు మాటలకు భిన్నమైన ఒక లోచూపు, ఒకవిధమైన తాజాదనం ఉట్టిపడుతున్నది. రెండు దేశాల మధ్య వాణిజ్య సహకారాన్ని నిరోధించే అడ్డుగోడలను, మానసిక ధోరణులను కుప్ప కూల్చడానికే తాము కృతనిశ్చ యంతో ఉన్నట్టు ఆయన స్పష్టీకరించారు. దేశాలకు తమ తమ నిశ్చిత వైఖరులు ఉంటాయనీ, అన్ని విషయాలలోనూ తమ మధ్య ఏకీభావం లేదన్న విషయంలో ఏకీభావానికి వస్తూనే ముందుకు సాగిపోవాలని ఆయన మాటల్లోని సారాంశం.

ఈ అభిప్రాయాలను కేవలం జర్దారీ అభిప్రాయాలుగా భావించడంకంటె పాకిస్థాన్ ప్రజలందరి మనోభావాలనే ఆయన ప్రతిబింబిస్తున్నారని అర్థం చేసుకోవాలి. రెండు దేశాల ప్రజలు అన్ని రంగాలలో ఇచ్చిపుచ్చుకొనే కల్తీలేని స్నేహ సంబంధాలకు ఆరాటపడుతున్న సంగతి ఇప్పటికే అనేక రూపాలలో రూఢి అయిన వాస్తవం. సైనిక నాయకత్వాలు ముందుకు తెచ్చిన ద్వేషపూరిత అజెండాలను అభిమానించి తమ అభివృద్ధికి తామే గోరీ కట్టుకోవడానికి పాకిస్థాన్ ప్రజలు సిద్ధంగా లేరు. ప్రజాస్వామ్యానికి అనుకూలంగా అక్కడ వ్యక్తమైన, అవుతున్న బలమైన ఆకాంక్ష ఈ మనస్థితిలో భాగమే తప్ప అన్యంకాదు. ఇటువంటి ప్రజాభిప్రాయాన్నే జర్దారీ తన మాటలలో మరింత స్పష్టంగా, బలంగా ఉద్ఘాటించారు.

పాకిస్థాన్‌లో ఇటీవలి రాజకీయ సంక్షుభిత వాతావరణం కారణంగా కుంటుబడిన ద్వైపాక్షిక చర్చల ఆశావహ పునఃప్రారంభానికి అవసరమైన సానుకూల వాతావరణాన్ని జర్దారీ వ్యాఖ్యలు సమకూర్చుతున్నాయి. ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు జరిగిన మిశ్రమ చర్చల ప్రక్రియను అయిదవ పర్యాయంవైపు నడిపించడం లక్ష్యంగా ఈ నెలలోనే రెండు దేశాల విదేశాంగ కార్యదర్శుల సమావేశం జరగగలదంటున్నారు. వచ్చే నెలలో రక్షణశాఖ కార్యదర్శులు సమావేశమై సియాచిన్‌పై చర్చలు జరపబోతున్నట్టు కూడా సమాచారం. కాశ్మీర్‌తో సహా వివిధ అంశాల పరిశీలనలో ఎనిమిది కమిటీలు ఇప్పటికే నిమగ్నమై ఉన్నాయి. మాటలుకానీ, రాకపోకలు కానీ లేని పరిస్థితి నుంచి; కనీసం మాటలు, రాకపోకలు సాధ్యమయ్యే స్థితికి చేరడం వెనుక ప్రధాన వివాదాన్ని పక్కనఉంచి ఇతర అంశాలపై దృష్టిపెట్టే ప్రాప్తకాలజ్ఞతే ప్రభావం చూపిందన్నది నిర్వివాదం. దానిని కొనసాగించడానికి అవసరమైన ఇంధనాన్ని జర్దారీ వ్యాఖ్యలు సరికొత్తగా అందిస్తున్నాయి.

వాక్య రత్నాకరం



రుణాల మాఫీవల్ల రైతుల ఆత్మహత్యలు తగ్గుతాయని నేను జోస్యం చెప్పలేను. రుణగ్రస్థతే కాకుండా రైతుల ఆత్మహత్యకు అనేక కారణాలున్నాయి.

■ కేంద్ర వ్యవసాయమంత్రి శరద్ పవార్

ప్రైవేట్ వడ్డీవ్యాపారులనుంచి రైతులు తీసుకొన్న రుణం విషయంలో నేను చేయగలిగింది ఏముంది? అలా ఎంత తీసుకొన్నారో ఎవరైనా లెక్కకట్టగలరా?

■ కేంద్ర ఆర్థికమంత్రి పి చిదంబరం

ప్రజావాక్కు

అనవసర ఆర్భాటాలు

ఎవరు చేయని అభివృద్ధి తాము చేశామనడం ఆర్భాటంగా ప్రజా 'ధనం'తో ప్రచారం చేసుకుంటున్న (ప్ర)'గతి' రథానికే చెల్లింది. ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు ఎంతవరకు ఉపయోగపడి అభివృద్ధి చెందామన్నది ప్రజలకు తెలుస్తుంది కాని ప్రభుత్వం తరఫున ప్రచారం చేస్తున్న 'ప్ర'గతిరథానికేమి తెలుస్తుంది? రాష్ట్రంలో కనీస అవసరాలు తీర్చుకోలేని దౌర్భాగ్యులున్నారనే విషయం పాలకులకు తెలియదా? ఆకలి చావులు, ఆత్మహత్యలు, కిడ్నాప్‌లు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ప్రేమహత్యలు, భూకబ్జాలు తదితర వాటిలో అభివృద్ధి సాధించిందని గట్టిగా ఉదాహరించవచ్చు. అధికారంలోకి వచ్చేవరకు మాటలతో బుజ్జగిస్తూ ఎన్ని పార్టీలు మారినా, ఎన్నిప్రభుత్వాలు మారినా ప్రజల బతుకులు మాత్రం మారలేదు. నాయకుల స్థితి మాత్రం మారింది. చట్టసభల్లో పెట్టిన 'ఎన్నికల బడ్జెట్'లో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించలేదు. విలాస జీవితం గడిపే వ్యక్తిపై ఉన్న ప్రేమ సగటు వ్యక్తిపై లేదు. బడ్జెట్‌లే ఇందుకు సాక్ష్యాలు.

● కె ముత్యాలప్ప, ఓబగానపల్లి, అనంతపురంజిల్లా

టర్నింగ్ పాయింట్

ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం ఎన్నిక ప్రచారం మాదిరిగా ర్యాంకులు, మార్కులు తక్కువ వచ్చినాకానీ, వాటిని గోరంతలు కొండంతలుగా ప్రకటనలు చేసి విద్యార్థులను బలవంతంగా చేర్పించుకుంటారు. అసలు కథ తర్వాత మొదల వుతుంది. ఆ పాఠశాలలో గదులు, ల్యాబ్ సౌకర్యాలు సరిగా ఉండవు. చెప్పడానికి లెక్చరర్లు ఉండరు. ఒకవేళ ఉన్నా వారు కళాశాలకు సక్రమంగా రారు. అంతేకాకుండా విద్యార్థులకు కూర్చోవడానికి సరిపడా స్థలం ఉండదు. ఒకవేళ ఉన్నా సౌకర్యంగా ఉండదు. పాఠశాలలో లెక్చరర్లు విద్యార్థుల పట్ల ప్రవర్తించే తీరు, బెదిరింపులు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కొన్ని కార్పొరేట్ కాలేజీల్లో ర్యాంకుల కోసం మానసికంగా హింసిస్తున్నారు. పరీక్షల సమయంలో ఫీజుల కోసం వేధింపులకు గురిచేస్తూ క్లాస్‌రూమ్ నుంచి బయటికి పంపుతున్నారు, పరీక్షల హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు దిశానిర్దేశంగా భావించే ఇంటర్మీడియెట్‌స్థాయి టర్నింగ్‌పాయింట్ అని ప్రైవేట్ యాజమాన్యం గుర్తించాలి. ప్రైవేట్ కళాశాలలు వ్యాపారధోరణితో కాకుండా విద్యార్థుల బంగారు భవిష్యత్తు గురించి ఆలోచిస్తే బాగుంటుంది.

●సిహెచ్ కిశోర్, మెదక్

సహనం అవసరం

బ్యాంకులు తమ సేవలను ఖాతాదారులకు, ప్రజలకు సంతృప్తికరంగా అందించలేకపోతున్నాయి. బ్యాంక్ సిబ్బంది ఖాతాదారుల పట్ల అసహనాన్ని ప్రదర్శిస్తున్నారు. అందుకు కారణం లేకపోలేదు. ఒకవక్క ఏటిఎంపై దృష్టి సారించడం, మరోపక్క తీవ్రమైన పనిభారంతో కంప్యూటర్ సిస్టమ్‌పట్ల తగిన నైపుణ్యం లేకపోవడం అని చెప్పవచ్చు. బ్యాంకుల వ్యాపారం ఈ మధ్యకాలంలో బాగా విస్తరించింది. ప్రజలలో బ్యాంకింగ్ రంగం పట్ల అవగాహన పెరగడంతో ఖాతాదారులు కూడా అధికమవుతున్నారు. ఉద్యోగుల నెలసరి జీతభత్యాలు, పెన్షన్స్, ఇక సాధారణ ప్రజల అవసరాలతో బ్యాంక్ సిబ్బంది సతమతమవడం సహజం. దీంతో ఖాతాదారులతో కాస్త కటువుగా ప్రవర్తించడం జరుగుతోంది. అలాకాక సహనంతో పనిచేయాలి. ఇటీవల కమ్యూనికేషన్ల మంత్రి బ్యాంకింగ్ బరిలోకి తపాలా విభాగాన్ని చేర్చడం అవసరమన్నారు. 'పోస్ట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా' ఏర్పాటు యోచన అమలుపర్చడం సంతోషం. దీనివల్ల ప్రజలకు సమయం ఆదాఅవుతుంది. గ్రామీణ స్థాయి నుంచి ఈ తరహా బ్యాంకింగ్ సేవలు ఉండటం అవసరం.

● పి ఎ గఫూర్, నందికొట్కూర్, కర్నూలు జిల్లా

అనుచిత వ్యాఖ్యలు తగవు

సంకుచిత భావంతో, అనుకూలత, అవకాశవాదంతో, వాక్‌చాతుర్యాలే ప్రధాన ధ్యేయంగా మాట్లాడే వ్యాఖ్యలు కొన్ని సామాజిక వర్గాల వారిని బాధిస్తున్నాయి. ఉద్యమాలకు ఊపిరిపోస్తున్నాయి. కొత్త పార్టీలకు బీజాన్ని నాటుతున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యంగా వర్ధిల్లుతున్న ఘనత మన భారత రాజ్యాంగ నేతలు అంబేడ్కర్, రాజేంద్రప్రసాద్‌లాంటి వ్యక్తులకు ఉన్నాయి. ఢిల్లీలో ఉన్నవారి ప్రతిష్ట చేసే వ్యాఖ్యలను బట్టి గల్లీలలో ఆవేశం కట్టలు తెంచుకుని ప్రవహిస్తున్నది. వ్యక్తిని దూషించినా, అంబేడ్కర్‌ని దూషించినట్లుగానే భావించాల్సిందే. ఏ వ్యక్తీ అంబేడ్కర్‌కు ప్రత్యామ్నాయం కాదు. వ్యక్తిగత దురహంకారం సమష్టి సంక్షేమాన్ని, మనుగడను దెబ్బతీయరాదు. అంబేడ్కర్ వల్లే నీకా పీట, పెద్దపీట అనడం అంతర్గత మనోభావాన్ని తెలియజేస్తున్నది. సమష్టి మనోభావాల్ని దెబ్బతీసింది. వక్రీకరణ తెలియనిది ప్రజలకుకాదు, అనువాదాలు, అనుకరణలు, నివేదికలు, విమర్శలు తెలిసిన మేధావులు సున్నిత అంశాలపై సాను కూలంగా స్పందించడం నైజం కావాలి. వ్యక్తిగత దృష్టి కంటే జాతీయదృష్టి ఉండాలి. కులంపేరుతో సాగుతున్న వివక్షను ప్రపంచ ప్రజలకు తెలియజెప్పడమే ననేది అంబేడ్కర్ ఉద్దేశం. అస్పృశ్యులుగా భావించిన వారిని అంబేడ్కర్ అణగారిన వర్గాలుగా, గాంధీజీ హరిజనులుగా పిలిచిన వైనాన్ని సమీక్షించుకోవాలి. మాయావతి అన్ని సామాజికవర్గాల్లో ఉన్న ఆర్థిక బలహీనులకు గుర్తింపు నిచ్చి రాజకీయచతురతను చాటుకున్నది మనకు ఆదర్శం కావాలి. చైతన్య భారత్‌కోసం ప్రజాస్వామ్యాన్ని ప్రక్షాళన చేయాల్సిన ప్రజాప్రతినిధులు ఆచి తూచి మాట్లాడాలి.

● చందు ఆంజనేయులు, నాగార్జునసాగర్

తెలంగాణ ప్రజలు కోరుతున్నది ప్రత్యేక రాష్ట్రమే

సి విఠల్, శ్రీధరరావుదేశ్‌పాండే

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఒక చట్టబద్ధ సంస్థను ఏర్పాటు చేస్తాం, దీనిపై మీరు చర్చకు సిద్ధమేనా అని ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెద్ద పెద్ద పత్రికా ప్రకటనల ద్వారా చర్చకు తెరతీసారు. తెలం గాణ ప్రజలకు ఇటువంటి తాయిలాలు ఆంధ్రావలస ప్రభుత్వాలు ప్రకటించడం కొత్తకాదు. తెలంగాణ ఆకాంక్షలు బలంగా తలెత్తిన ప్రతిసారి ఇటువంటి తాయిలాలను వారు తెలంగాణ ప్రజలకు చూపిస్తూపోయారు. 1956లో పెద్దమనుషుల ఒప్పందం, 1969లో జీవో36, 1973లో ఆరుసూత్రాల పథకం, 1975లో రాష్ట్రపతి ఉత్తర్వులు, 1985లో 610జిఒ, 2004లో గిర్‌గ్లానీ కమిషన్, 2006లో ప్రాంతీయ అభివృద్ధి బోర్డు..ఇట్లా తాయిలాలు ఇస్తూనే పోయారు. ఇపుడు మరో చట్టబద్ధ సంస్థ ఆ జాబితాలో చేరబోతున్నది. గత 50ఏళ్లుగా అన్ని చట్టబద్ధ ఒప్పందాలు ఉల్లంఘనలకు గురి అయినాయి. చట్టబద్ధసంస్థలు, కమిషన్లు ఇచ్చిన రిపోర్టులు బుట్టదాఖలైనాయి. ఇక ఏ ఆశతో మరో చట్టబద్ధసంస్థను తెలంగాణ ప్రజలు అంగీకరించాలి? ఈ సందర్భంలో సంక్షిప్తంగానైనా ఈ తాయిలాలు, వాటి ఉల్లంఘనల చరిత్రను మననం చేసుకోవాలని మేం భావిస్తున్నాం.

ఫజల్ అలీ కమిషన్ ఏం చెప్పింది?

విలీనం వల్ల జరగబోయే నష్టాలను ఫజల్ అలీ కమిషన్ ముందు తెలంగాణ ప్రజాసంఘాలు వివరంగా చెప్పాయి. తెలంగాణ కోస్తాకు వలస ప్రాంతంగా మారుతుందని, నీళ్లు, నిధులు, నియామకాలు కోస్తాకే తరలిపోతాయని ఏకరవుపెట్టుకున్నారు. ఈ భయాలకు, అనుమానాలకు విరుగుడుగా కోస్తా నాయకులు అనేక రక్షణలను హామీ ఇచ్చారు. ఆ మేరకు అసెంబ్లీలో తీర్మానాలు ఆమోదించారు. ఈ అంశాలన్నింటిని కమిషన్ కూలంకషంగా చర్చించింది. కమిషన్ ఈ విధంగా తమ అభిప్రాయాలను పొందుపరిచింది.

'తెలంగాణ విశాలాంధ్రలో భాగం కాదల్చుకుంటే, తెలంగాణ ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు తగిన ఏర్పాట్లకు సమ్మతించడానికి ఆంధ్ర రాష్ట్ర నాయకులు సిద్ధంగా ఉన్నట్లు మాకు అవగతమయింది. ఈ ఏర్పాట్లు (రాయలసీమ, కోస్తాంధ్రల మధ్య జరిగిన శ్రీబాగ్ ఒప్పందం తరహాలో) ప్రభుత్వోద్యోగాలలో మూడవవంతు అవకాశాలను, అంటే ఇంచుమించు జనాభా దామాషాలో తెలంగాణవారికి కల్పించడానికి, తెలంగాణ ప్రాంత అభివృద్ధి పథకాలపై ప్రత్యేక దృష్టిని పెట్టడానికి హామీ ఇచ్చేరూపంలో ఉండవచ్చు. ఈ తరహాలో చేయగల ఏర్పాట్ల గురించి వివరాలను మేం జాగ్రత్తగా పరిశీలించాం. శ్రీబాగ్ ఒప్పందం తరహాలోకాని, బ్రిటిష్ 'స్కాటిష్ డివల్యూషన్' తరహాలో రాజ్యాంగపరమైన ఏర్పాట్ల రూపంలో కానీ చేసే ఏర్పాట్లు సరిపోవని మాకు అనిపించింది. తెలంగాణ ప్రత్యేక అవసరాలను తీర్చడానికి ఉద్దేశించిన ఏ చర్యలైనా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోతే ఫలితాలనివ్వవు. తెలంగాణవిషయంలో అటువంటి ఏర్పాటును సూచించడం మా పరిధిలోకి రాదు." (ఎస్సార్సీ రిపోర్టు పేరా 383, 384) ఇంత స్పష్టమైన అభిప్రాయాలతోనే ఫజల్ అలీ కమిషన్ తెలంగాణ ప్రాంతం ప్రత్యేక రాష్ట్రంగా అవతరించాలని సిఫారసు చేసింది. రాజ్యాంగపరమైన రక్షణలపై వెలిబుచ్చిన ఫజల్ అలీ కమిషన్ అభిప్రాయాలు తర్వాతి కాలంలో ఏవిధంగా నిజమైనాయో ఇపుడు చూద్దాం.

1. పెద్ద మనుషుల ఒప్పందం : ఈ ఒప్పందమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంఏర్పాటుకు ప్రాతిపదికగా నిలిచింది. ఈ ఒప్పందంపై 19.7.1956న ఆంధ్రరాష్ట్రం తరఫున బెజవాడ గోపాలరెడ్డి (ముఖ్యమంత్రి), నీలం సంజీవరెడ్డి (ఉపముఖ్యమంత్రి) 3) గౌతులచ్చన్న (మంత్రి) 4) అల్లూరి సత్యనారాయణరాజు (కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు); హైదరాబాద్ రాష్ట్రం తరపున 1) బూర్గుల రామకృష్ణారావు (ముఖ్యమంత్రి), 2) కె.వి.రంగారెడ్డి (మంత్రి), 3) మర్రిచెన్నారెడ్డి (మంత్రి)4) జె.వి.నర్సింగరావు(రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు) కేంద్ర హోంమంత్రి జెబిపంత్ సమక్షంలో సంతకాలు చేశారు. పెద్దమనుషుల ఒప్పందంలో చోటుచేసుకున్న అంశాలు చాలానే ఉన్నప్పటికీ ప్రధానమైనవి :- సాధారణపరిపాలనావ్యయాన్ని ఆంధ్ర, తెలంగాణలు 2:1 నిష్పత్తిలో భరించాలి. - తెలంగాణ మిగులు ఆదాయాన్ని తెలంగాణ ప్రాంత అభివృద్ధికే ఖర్చు చెయ్యాలి.

● తెలంగాణలో ఉన్న విద్యా సౌకర్యాలు తెలంగాణ విద్యార్థులకే అందేలాచూసి ఇంకా అభివృద్ధి పరచాలి. ● హైదరాబాద్ రాష్ట్రంలో అమలులో ఉన్న ముల్కీనిబంధనలు కొనసాగించాలి. ● తెలంగాణ ప్రాంతంలో భూముల అమ్మకాలు ప్రాంతీయ మండలి అధీనంలో ఉండాలి ● తెలంగాణ ప్రాంతీయమండలి తెలంగాణ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు తయారుచేస్తుంది. పర్యవేక్షిస్తుంది. ● ముఖ్యమంత్రి ఆంధ్రుడైతే ఉపముఖ్యమంత్రి పదవి తెలంగాణకు, ముఖ్యమంత్రి తెలంగాణవాడైతే ఉపముఖ్యమంత్రి పదవి ఆంధ్రకు ఇవ్వాలి. మంత్రి మండలిలో 60:40నిష్పత్తిలో ఆంధ్రకు, తెలంగాణకు ప్రాతినిధ్యం ఉండాలి.

పెద్దమనుషుల ఒప్పందం - నవంబర్ 1, 1956న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన మరుక్షణమే సంతకాల తడికూడా ఆరకుండానే ఉల్లంఘనకు గురిఅయింది. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఒప్పందం మేరకు తెలంగాణ వ్యక్తికి ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి. కాని ఆనాటి వరకు ఆంధ్రరాష్ట్రానికి ఉపముఖ్యమంత్రిగా వ్యవహరించిన నీలంసంజీవరెడ్డికి విచిత్రంగా ముఖ్యమంత్రి కాగానే ఉపముఖ్యమంత్రి పదవి ఆరోవేలుగా మారింది. తెలంగాణ వ్యక్తిని ఆ పదవిలో నియమించకుండా ఉల్లంఘనకు పాల్పడ్డారు. అది మొదలు ఉల్లంఘనలు నిరంతరంగా, నిరాఘాటంగా కొనసాగాయి. ఇంకా కొనసాగుతున్నాయి. ముల్కీ నిబంధనలకు విరుద్ధంగా, దొంగ ముల్కీ సర్టిఫికెట్లు ఇప్పించి వేలాది మందిని తెలంగాణ ఉద్యోగాలలో నియమించారు. ప్రాంతీయ మండలి అనుమతి లేకుండానే లక్షలాది ఎకరాల తెలంగాణ భూములను ఆంధ్ర నుంచి వలసవచ్చిన ప్రజలు కొన్నారు. తెలంగాణ మిగులు ఆదాయాన్ని తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉండగా అవి ఆంధ్ర ప్రాంతపు లోటునుభర్తీ చేయడానికి తరలించారు. లలిత్ కమిటి నివేదిక ఈ నిధుల తరలింపును బహిర్గతం చేసింది. తెలంగాణ ప్రాంతీయ మండలి ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలన్నీ బుట్టదాఖలైనాయి. ఈ రకంగా పెద్ద మనుషుల ఒప్పందం ఎందుకూ కొరగాని పత్రంగా మిగిలిపోయింది.

2. తెలంగాణ ప్రాంతీయ మండలి:

● పెద్దమనుషుల ఒప్పందం మేరకే తెలంగాణ ప్రాంతీయ మండలి ఏర్పాటుకు ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు అంగీకరించాయి. 7వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 371లో తెలంగాణ ప్రాంతీయ మండలిని ఏర్పాటుచేసి చట్టబద్ధత కల్పించారు. ఈ ప్రాంతీయ మండలి విధులు, అధికారాలు విస్తృతమైనవి. స్థూలంగా ● తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి వ్యవసాయం, నీటిపారుదల, పరిశ్రమలు, విద్య, ఉపాధి తదితర రంగాలలో అభివృద్ధి ప్రణాళికలు రచిస్తుంది. అమలుపరుస్తుంది.● తెలంగాణ ఆదాయ వ్యయాలను సమీక్షించి ప్రభుత్వానికి నివేదిస్తుంది. ● తెలంగాణ ఆదాయం తెలంగాణలో ఖర్చు అవుతున్నదీ లేనిదీ పర్యవేక్షిస్తుంది. ● ముల్కీ నిబంధనల అమలుతీరును పర్యవేక్షిస్తుంది ● తెలంగాణేతరులు జరిపే తెలంగాణ భూముల అమ్మకాలు, కొనుగోళ్లపై నియంత్రణ ఉన్నందున ఈ అంశంలో ఉల్లంఘనల్ని సమీక్షించి తగు నిర్ణయాలు తీసుకుంటుంది. ● ఈ మండలికి ముఖ్యమంత్రిగాని, ఉపముఖ్యమంత్రిగాని ఎవరు తెలంగాణ వారైతే వారు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. 20మంది సభ్యులను తెలంగాణ ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారు. ప్రతి జిల్లా నుంచి ఒక్కొక్క ఎమ్మెల్యే చొప్పున 9మంది ఎమ్మెల్యేలు, 6గురుతెలంగాణ ఎంపిలు, 5మంది తెలంగాణ మేధావులు/నిపుణులు సభ్యులుగా ఉంటారు. తెలంగాణ మంత్రులందరూ ఎక్స్‌అఫిషియో సభ్యులుగాఉంటారు. ఏమంత్రినైనా సమావేశాలకు పిలిపించి వివరణలు తీసుకునే అధికారం మండలికి ఉంటుంది.

ఇంతటి విస్తృతాధికారాలు కల్గిన చట్టబద్ధ సంస్థనే ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి. దీనికి ఛైర్మన్‌లుగా వ్యవహరించిన అచ్యుతరెడ్డి, చొక్కారావులు (ఉపముఖ్యమంత్రులు నియమించకపోవడంవల్ల వీరు ఛైర్మన్‌లుగా వ్యవహరించారు) అనేక సవివరమైన నివేదికల్ని ప్రభుత్వానికి సమర్పించినా అవన్నీ బుట్టదాఖలైనాయి. చర్యలు శూన్యం. ఉల్లంఘన పరంపర నిరాఘాటంగా కొనసాగింది. చివరికి జైఆంధ్రా ఉద్యమానికి లొంగి ఈ రాజ్యాంగబద్ధసంస్థకు పాతర వేశారు.

3. ముల్కీ నిబంధనలపై సుప్రీంతీర్పు :

1969లో వెల్లువెత్తిన ప్రజా ఉద్యమానికి తల ఒగ్గి తెలంగాణ ఉద్యోగాలలో ముల్కీ నిబంధనలకు విరుద్ధంగా దిగబడిన స్థానికేతరులను వెనుకకి పంపేందుకు ప్రభుత్వం జిఒ 36ను (ఈనాటి జీవో 610లాంటిదే) జారీ చేసింది.

(సశేషం)

రచయితలు తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు

ఆంగ్లాన్ని ఆడిపోసుకోవడం తప్ప

వాడుక తెలుగు అభివృద్ధికి మనం చేస్తున్నదేమిటి?

మద్దిపట్ల రామకృష్ణ

వాడుకభాషగా తెలుగు భాషను అభివృద్ధి చేయడం గురించి ఏ పెద్దమనిషిని కదిలించినా, ఆంగ్ల భాషా మాధ్యమ పాఠశాలలపై విరుచుకు పడడం సర్వసాధారణమైపోయింది. తెలుగుభాషా భివృద్ధికి, ఆంగ్లమాధ్యమ పాఠశాలలకూ గల సంబంధమేమిటో తెలియటం లేదు. ఇప్పటికీ రాష్ట్రంలో 75శాతం విద్యార్థులు తెలుగు మాధ్యమ పాఠశాలల్లో చదువుకుంటున్నారని గణాంకాలు తెలియచేస్తున్నాయి. మరి ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తెలుగుభాషలో ఎంతవరకు ప్రావీణ్యం సంపాదించగలుగుతున్నా రన్నది ఈ విమర్శకులు తెలియచెప్పితే బాగుంటుంది.

శాసన, పాలన, న్యాయ వ్యవస్థలు తమ వ్యవహారాలను, ఇంకొక రకంగా చెప్పాలంటే తమ ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగుభాషలో జరిపితే తెలుగుభాష వాడకం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నప్పటికీ, ఈ వ్యవహారాల్లో వాడుతున్న తెలుగు ఎంతశాతం జనసామాన్యానికి అర్థమవుతోంది? ప్రభుత్వపరంగా వెలువడుతున్న ఈ ఉత్తర్వులలో ఉపయోగిస్తున్న పదజాలం తెలుగుపదజాలంగాకాక ఏదో పరాయి భాషను చదువుతున్నట్లు అనిపిస్తుంది. దీనికి కారణం ఆంగ్లపదాలను అనువాదం చేయడానికి ప్రయత్నిస్తూండడమే. అనువాదానికి పోకుండా నిత్యంఉపయోగిస్తున్న తెలుగుభాషలోని పర్యాయ పదాలను ఉపయోగించు కోవాలి. ఒకవేళ తగిన పర్యాయపదం దొరకకపోతే నూతన పదాన్ని సృష్టించుకొని వాడుకలోకి తీసుకురావాలి.

ప్రధానంగా దినపత్రికలు, దృశ్య్రశవ్య సాధనాలు తెలుగువాడుక భాషను ప్రచారంలోకి తీసుకు రావడంలో ముఖ్యపాత్రను పోషించగలవు. ప్రస్తుతకాలంలో దాదాపు తొంభైశాతం జనాభాను ప్రసార మాధ్యమాలు చేరగలుగుతున్నాయి. దురదృష్టవశాత్తు ఈ సాధనాలు ఉపయో గిస్తున్న తెలుగుభాషలో అధికంగా ఆంగ్లపదాలు చోటుచేసు కుంటున్నాయి. ఇతర రాష్ట్రాలలో ఈ పరిస్థితి లేదు. తెలుగుభాష పరిపుష్టమైనది కాదా, తెలుగు భాషలో పదాలు తక్కువా అన్న సందేహాలు కలుగుతాయి. దక్షిణ భారత భాషలైన కన్నడ, తమిళ, మలయాళభాషల సంగతి తెలియదుకానీ, హిందీ, మరాఠీ భాషలు మాత్రం పద సంపన్నమయిన వని చెప్పవచ్చు. 'స్లీపర్‌కోచ్'కు తెలుగు పర్యాయపదం చెప్పమని నేను ఒక తెలుగు భాషాభిమానిని అడి గాను. అందుకు ఆయన 'అసలు రైలుబళ్ళు, స్లీపర్‌కోచ్‌లు తెలుగుదేశంలో కనిపెట్టలేదు. కాబట్టి వాటికి తెలుగుపదాలు ఉండవు' అని అన్నారు. హిందీ, మరాఠీ భాషలలో దీనికి పర్యాయపదంగా 'శయన్‌యాన్' అనే పదాన్ని సునాయాసంగా వాడుతున్నారు. మరి రైలుబళ్ళు, మహారాష్ట్ర లేక ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో కనిపెట్టినవా? ఇకపోతే మరాఠీ పత్రికలు 99శాతం మరాఠీ పదాలను వాడతాయి. ఆంగ్ల పదానికి బదులుగా, సామాన్యజనం సులువుగా అర్థం చేసుకోగల తగిన తెలుగు పర్యాయ పదాన్ని వెతికిపట్టుకోవాలి. అంతేకాని అనువాదం చేయాలని ప్రయత్నించకూడదు. మనభాషలో తగిన పర్యాయపదం దొరకకపోతే సంస్కృత భాషలోగాని మరే ఇతర భారతీయ భాషలలోగాని ఉపయోగించే పదాలను మనం వాడుకలోకి తెచ్చుకోవడంలో తప్పులేదు.

ఆంగ్లపదాలులేని తెలుగును వాడుకలోకి తీసుకురావడంలో, జనసామాన్యంతో దగ్గర సంబంధముండే ప్రభుత్వాధికారులుకూడా ఇతోధికంగా తోడ్పడగలుగుతారు. జిల్లాధికారి నుంచి పంచాయతీ కార్యదర్శి వరకూ వారు నిర్వహించే సమావేశాలలో తెలుగుభాషను ఉపయోగించాలి. కార్యాలయ నామఫలకాలను తెలుగుభాషలో రాయించాలి. దానర్థం తెలుగు లిపి అనికాదు. ఉదాహరణకు: 'కలెక్టరువారి కార్యాలయం'కు బదులుగా 'జిల్లాధికారి కార్యాలయం' అని, 'గవర్నమెంటు ఆసుపత్రి'కి బదులుగా 'ప్రభుత్వ వైద్యాలయం' అని రాయించవచ్చు. వినడానికి, చదవడానికి చాదస్తంగా మొదట్లో అనిపించినా వాడుకలోకి వచ్చినకొద్దీ భాష తీయదనాన్ని సంతరించుకుంటుంది.

అలాగే తెలుగు మాధ్యమ పాఠశాలలో ఉపయోగించే భాష, పూర్తి తెలుగులో ఉండేటట్లుగా చూడాలి. ఉపాధ్యాయులు తెలుగుభాషా పదాలనే వాడుతూండాలి. వారి నుంచి విద్యార్థులు, విద్యార్థుల నుంచి వారి తల్లిదండ్రులు ఆ పదాలను ఉపయోగించుతారు. మహారాష్ట్రలో మరాఠీ పాఠశాలలో 'క్లాసు', 'సెక్షన్', 'బ్లాక్ బోర్డు' 'అటెండన్స్ రిజిస్టర్' 'ప్రైమరీ స్కూల్', 'హైస్కూల్' 'జూనియర్ కాలేజ్' 'హెడ్మాస్టరు' అనే పదాలు వినబడవు. ముంబయి వంటి మహానగరమైనా, మారుమూల కుగ్రామ మైనా మరాఠీ పదాలనే వాడతారు. గణిత పాఠ్యపుస్తకాలలో మరాఠీ అంకెలు వాడుతారు. వ్యక్తిగత వాహనాలపై మరాఠీ అక్షరాలు, మరాఠీ అంకెలు ఉంటాయి. కాలెండర్లలో మరాఠీ అంకెలు వాడుతారు. జయంత్‌నార్లీకర్ ప్రఖ్యాత అంతర్జాతీయ ఖగోళ శాస్త్రజ్ఞుడు. ఆయన మహారాష్ట్రలోని కళాశాలల్లో, విశ్వకళాపరిషత్తు (యూనివర్సిటీ) లలో ఉపన్యసించవలసి వచ్చినపుడు మరాఠీభాషలోనే ఉపన్యసిస్తారు. అతి క్లిష్ట, సాంకేతిక ఆంగ్లపదాలకు కూడా మరాఠీ పర్యాయ పదాలను వాడుతారు. అత్యధిక శాతం మహారాష్ట్రులు తమ సంతకాలను మరాఠీ భాషలోనే చేస్తారు. దీనిని ప్రాంతీయ దురభిమా నంగా తీసుకోకూడదు. భాషాభిమానంగా పరిగణించాలి.

జర్మనీ, ఫ్రాన్స్, రష్యా, చైనా, లాటిన్ అమెరికా మొదలైన దేశాలలోమాతృభాషలోనే ఉన్నత, సాంకేతిక విద్యాధ్యయనం జరుగుతోంది. ఆ దేశాల వారు శాస్త్ర, సాంకేతిక రంగాలలో వెనుకబడి లేదుగదా! ఆ దేశాల ఆధిపతులకు ఆంగ్లభాషలోసంభాషించటం రాదంటే అతిశయోక్తి కాదు. విదేశాలకు పర్యటనకు వెళ్ళినప్పుడు అనువాదకులను వెంటబెట్టుకుని వెళ్ళడానికి మొగమాటపడరు. కాని మన తెలుగు రాష్ట్రంలోనే అనేకమంది శాసనకర్తలు, అధికారులు తెలుగులో మాట్లాడడాన్ని నామోషీగా భావిస్తారు.

చివరగా దినపత్రికలలో వ్యక్తుల పేర్లకు బదులు ఆంగ్ల పొడిఅక్షరాలనువాడడం చూస్తే విచారం కలుగుతుంది. వైఎస్, ఎమ్మెస్, టిడిపి, టిఆర్ఎస్ అని వాడడానికి బదులుగా తెలుగు పొడి అక్షరాలు వాడితే బాగుంటుంది. సినారె అంటే ఎంత తియ్యగా ఉంది! అదే సిఎన్ఆర్ అంటే కర్కశంగా ఉంటుంది. దినపత్రికల సంపాదకులు, వార్తా విలేకరులు తమ పత్రికలో ఆంగ్లభాషా పదాల వాడకను సాధ్యమైనంతవరకూ తగ్గించే దిశగా ముందడుగువేస్తే వాడుక తెలుగుభాష అభివృద్ధికి రాచబాట వేసినవారవుతారు. తెలుగుభాషా చరిత్రలో చిరస్మరణీయులుగా మిగిలిపోతారు. ❑

వార్తలలోని వ్యక్తులు





ముగ్గురు ఆర్థిక 'మాంత్రికుల' ముచ్చట్లు

■ **తుర్లపాటి కుటుంబరావు**

కడచినవారం, పదిరోజులలో ముగ్గురు ఆర్థిక మంత్రులు ప్రవేశపెట్టిన బడ్జెట్లు ఇటు రాష్ట్రంలోను, అటు దేశంలోను సంచలనం, సంతృప్తి కలిగించాయి. ముగ్గురు ఆర్థిక మంత్రులెవరన్న ప్రశ్నరావచ్చు. కేంద్రంలో చిదంబరం, రాష్ట్రంలో రోశయ్య, మూడవవారు రైల్వే మంత్రి లాలు ప్రసాద్ యాదవ్. రైల్వే మంత్రి ఆర్థిక మంత్రి ఎలా కాగలడు? రైల్వేశాఖ ఆర్థికశాఖ తరువాత అంతగాను కేంద్రానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖ. లోగడ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత చాలా సంవత్సరాలవరకు రైల్వేబడ్జెట్టు మిగులులో ఉండేది. ఆ మిగులును కేంద్ర ప్రభుత్వ ఆదాయానికి చేర్చి, సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించేవారు. ఆ తరువాత రైల్వే బడ్జెట్లు లోటులో పడ్డాయి! చాలా సంవత్సరాలు లోటు బడ్జెట్లే. లాలుప్రసాద్ రైల్వే మంత్రిగా వచ్చిన తరువాతనే ఆ శాఖ బడ్జెట్టు తిరిగి మిగులులోపడింది. కేవలం మిగులేకాదు, ఆయన ప్రతి ఏడాది రైల్వేశాఖ బడ్జెట్టులో ఇబ్బడి ముబ్బడిగా లాభాలు చూపిస్తున్నారు. ఈ నాలుగేళ్లలో ఏ ఏడాదికా ఏడాది రైల్వేలమీద వచ్చే లాభాలు పెరుగుతున్నాయి. మొన్న రైల్వే బడ్జెట్టు అయితే, 25వేల కోట్ల రూపాయల లాభం చూపించింది. అలా అని ప్రయాణికుల చార్జీలు, రవాణా చార్జీలు పెంచారా? లేదు. పైపెచ్చు, కొత్తరైళ్లను, ప్రయాణికులకు మరికొన్ని సౌకర్యాలను పెంచుతున్నారు. లోగడ రైలుచార్జీలు బడ్జెట్ బడ్జెట్‌కూ పెంచేవారు. లాలు ప్రసాద్ హయాంలో సామాన్య ప్రయాణికులపై ఎలాంటి భారం పడలేదు.

నిజమే! బీహార్ ముఖ్యమంత్రిగా లాలుప్రసాద్ దాదాపు పదేళ్లు ఉన్నా, ఆయనకు వచ్చింది మంచి పేరుకాదు. అవినీతి ఆరోపణలు వచ్చాయి. పశువుల దాణా కేసులో ఆయన శ్రీకృష్ణజన్మస్థానానికి కూడా వెళ్లివచ్చారు. జెయిలుకు వెళ్లే ముందు తన భార్య రబ్రీదేవిని-రాజకీయాల ఓనమాలు కూడా తెలియని సామాన్య గృహిణిని పార్టీలో చాలామందికి చెప్పా పెట్టకుండా ముఖ్యమంత్రిని చేయటం లాలూకే చెల్లింది! ఒకవిధంగా ముఖ్యమంత్రిగా భర్తకంటె భార్యే మంచిపేరు సంపాదించారని చెప్పవచ్చు. అయితే, ముఖ్యమంత్రిగా నడిచింది రబ్రీదేవేకాని, ఆమెను తెరవెనుక ఉండి నడిపించింది లాలూయే. ఏమైనా, ముఖ్యమంత్రిగా లాలూది 'ఫెయిల్యూర్ స్టోరీ' అయితే, రైల్వేమంత్రిగా ఆయనది 'సక్సెస్ స్టోరీ', 'గ్రాండ్ సక్సెస్ స్టోరీ'.

చిదంబరం చిద్విలాసం

ఇక, కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం విషయం సరేసరి! ఆర్థిక వ్యవహారాలలో ఆయన ఆరితేరారు. కచ్చి తంగా చెప్పాలంటే, 2004లో ఆయన కాంగ్రెస్ టిక్కెట్టుపై ఎన్నిక కాకపోయినా, ఆయనను కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఏ ప్రభుత్వం ఆర్థికమంత్రిగా నియమించింది. అంతకుపూర్వం కూడా ఆయన రెండుసార్లు ఆర్థిక మంత్రిగా కేంద్ర బడ్జెట్టు ప్రవేశపెట్టారు. ఇది ఆయనకు ఏడవ బడ్జెట్టు. మొరార్జీ దేశాయ్ మొత్తం పది బడ్జెట్లను ప్రవేశపెట్టిన ఘనుడు. ఆయన తరువాత ఏడు బడ్జెట్లను ప్రవేశపెట్టిన రికార్డు సాధించిన ఆర్థిక మంత్రులత్రయం చింతామణి దేశ్‌ముఖ్. వై.బి.చవాన్, పి చిదంబరం, అన్నట్టు, భారత స్వాతంత్ర్యం సిద్ధించిన కొత్తలో చాలావరకు కాంగ్రెసేతరులే మన ఆర్థిక మంత్రులు. ఆర్.కె.షణ్ముగం చెట్టియార్, జాన్ మత్తయ్, సిహెచ్.భాభా, సి.డి.దేశ్‌ముఖ్. స్వాతంత్ర్యం వచ్చిన సరిగా నూరు రోజులకు 1947 నవంబరు 16న స్వతంత్ర భారత తొలిబడ్జెట్టును ప్రవేశపెట్టిన ఘనత ఆర్.కె. షణ్ముగం చెట్టియార్‌దే. అన్నట్టు, ఇప్పటి ఆర్థిక మంత్రి పూర్తిపేరు పళనియప్పన్ చిదంబరం చెట్టియార్. లోగడ పి.వి.నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి మన్‌మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్‌కు సర్వత్రా హర్షం వ్యక్తమైతే, ఇప్పటి చిదంబరం బడ్జెట్టు దేశప్రజలపై వరాలు, రాయితీల వర్షం కురిపించింది. బహుశా ఇంత ప్రజాప్రయోజనకరమైన బడ్జెట్టు ఇదివరలో రాలేదని చెప్పవచ్చు.

రోశయ్య రికార్డు

ఇక, మన రాష్ట్రంలో మొన్న ఆర్థిక మంత్రి రోశయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్టు మన రాష్ట్ర బడ్జెట్టులన్నింటిలో రికార్డు. అది లక్షా 436కోట్ల బడ్జెట్టు. దేశంలో అతి పెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ తరువాత రెండవ భారీబడ్జెట్టు. పైగా అది లోటులేని బడ్జెట్టు. కొత్త పన్నులు వేయలేదు. ఉన్న పన్నులు పెంచలేదు. పైపెచ్చు 709కోట్లు మిగులు చూపించారు. ఇంత పెద్ద బడ్జెట్టు ప్రవేశపెట్టిన ఘనత ఆర్థిక మంత్రి రోశయ్యకు దక్కింది. అంతేకాదు, ఇది, ఆర్థిక మంత్రిగా ఆయన ప్రవేశపెట్టిన 13వ రికార్డు బడ్జెట్టు!

కాగా, 1946లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం ప్రభుత్వం బడ్జెట్టు, 1947 నవంబర్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి షణ్ముగం చెట్టియార్ ప్రవేశపెట్టిన తొలిబడ్జెట్‌ల దగ్గరనుంచి మన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను ఆసక్తిగాపరిశీలిస్తూ వచ్చాను. ఏ బడ్జెట్టుపైనైనా, ఎలాంటి బడ్జెట్‌పైనైనా, ఆయా ప్రతిపక్షాలు పెదవివిరుస్తాయి! ప్రభుత్వ పక్షాలు హర్షామోదాలు వ్యక్తంచేస్తాయి! పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వాటి పాత్రలుఅవి! అవి ఆయా పాత్రల 'డైలాగ్స్!' అలా కాకపోతే, ఇంతవరకు, ఇన్నేళ్లుగా ఏ బడ్జెట్టునైనా ప్రతిపక్షం మెచ్చుకున్న సందర్భం ఉన్నదేమో చూపించండి! లేదా, ప్రభుత్వ పక్షం ఏ బడ్జెట్టునైనా విమర్శించిన దాఖలాలున్నాయా?

పోతే, ఈసారి మూడు బడ్జెట్లను (కేంద్రంలో జనరల్, రైల్వే బడ్జెట్లు, రాష్ట్ర బడ్జెట్) ఎన్నికల బడ్జెట్లు అని కొందరు విమర్శిస్తున్నారు! ఎన్నికల ముందు వచ్చే బడ్జెట్‌ను ఎన్నికల బడ్జెట్టు అనడం మామూలే. అయితే ఎన్నికల బడ్జెట్టు అయినా, మరొకటి అయినా, ప్రజాస్వామ్యానికి అది ఏమేరకు మేలు చేస్తుందన్నది ఆలోచించాలి. ఏ పేరుతో చేసినా, ఎలా చేసినా ప్రజలకు మేలు జరిగితే, అంతకంటె కావలసినది ఏముంది? ఈ దృష్టితో చూచినప్పుడు ఈ ఏడాది చిదంబరం బడ్జెట్టు కాని, లాలు రైల్వే బడ్జెట్‌కాని, రోశయ్య రాష్ట్ర బడ్జెట్టు కాని జనసామాన్యానికి ప్రయోజనకరమైనవేననడం నిర్వివాదం. మంచి బడ్జెట్టును కూడా విమర్శించాలి కాబట్టి విమర్శిస్తున్నామంటే విమర్శకే విలువపోదా? ప్రతిపక్షం అంటే ప్రతిదాన్ని పూర్వపక్షం చేయడం కాదే! ❑

క్విజ్ ప్రశ్న: ఆరేళ్ళ తర్వాత మళ్ళీ మనదేశాన్ని సందర్శించిన పక్షిగా ఈ మధ్య వార్తలకు ఎక్కినది ఏది? (జవాబు రేపు) ★ శనివారంనాటి ప్రశ్నకు జవాబు: బంగాళ దుంపను మొదట పెరు మెట్ట ప్రాంతాలలో కనుగొన్నారు.